
# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 247 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 14 ఆగస్టు 2026 | పేజీలు :4


## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్లు పక్కాగా

# అమలు చేయాలి

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- జనగామ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

2 లో





## రైతుల పంటలను కాపాడటమే

# ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- దేవాదుల రిజర్వాయర్లతో ఉమ్మడి జిల్లాకు భరోసా
- రఘునాథపల్లిలో రూ. 100 కోట్లతో 220 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు
- సాగు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి, మన చౌరాస్తా : ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎండిపోతున్న రైతుల పంటలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుండి నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సాగునీటిని విడుదల చేశారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పరిశీలించి, చివరి ఆయకట్టు వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయనప్పటికీ, నెల రోజులుగా ముందస్తు చర్యలతో దేవాదుల రిజర్వాయర్లను నింపడం వల్లే ఇప్పుడు 'ఆన్ అండ్ ఆఫ్' పద్ధతిలో సాగునీరు అందించడం సాధ్యమైందన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ ఆరుతడి పంటలను కాపాడుకోవాలని కోరారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రూ. 500 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలోనే రఘునాథపల్లిలో రూ. 100 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయిస్తున్నట్లు వెల్లడించారు. కాళేశ్వరం నీటిని వాడకుండానే దేశంలోనే అత్యధిక వరి దిగుబడి సాధించామని, గత ప్రభుత్వ హయాంలో మెడిగడ్డ కుంగిపోతే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


## wanted

### విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



# రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలి

- **తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**జనగామ, మన చౌరాస్తా :** ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల రిజర్వేషన్ల అమలు, బ్యాక్లాగ్ ఖాళీల భర్తీ, పదోన్నతులు, సేవా అంశాలు, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు, బాధితులకు న్యాయం, భూముల పరిరక్షణ, గురుకులాలు, గిరిజన సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై చైర్మన్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, సబ్ ప్లాన్ నిధులను ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖలలో నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు తమ సమస్యలతో అధికారుల వద్దకు వచ్చినప్పుడు మానవీయ కోణంలో ఆలోచించి, వారిని గౌరవంగా కూర్చోబెట్టి ఓపికగా వినాలని సూచించారు. ప్రతి అధికారి బాధితుల ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా సున్నితంగా వ్యవహరించి న్యాయం చేయాలని తెలిపారు. స్థానిక స్థాయిలో 'సివిల్ రైట్స్ డే'ను విధిగా నిర్వహించాలని, దీనికి తహసీల్దార్లు, ఎస్సైలు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కె. లక్ష్మీ నారాయణ, రాంబాబు నాయక్, సంతోష్ నాయక్, శంకర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, సీపీఓ చినకోట్యా నాయక్, డీఎంహెచ్ఓ వాణి శ్రీ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్, ఏసీపీలు, ఇతర జిల్లా అధికారులు, వివిధ వర్గాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కవి పొట్టబత్తిని మృతి సాహిత్యరంగానికి తీరని లోటు

## పద్మశ్రీ గడ్డం సమ్మయ్య



**జనగామ, మన చౌరాస్తా :** సామాజిక కవి, ఉపాధ్యాయుడు పొట్టబత్తిని భాస్కర్ ఆకస్మిక మరణం కళా,సాహిత్య రంగాలకు,జనగామ గడ్డకు తీరని తీరనిలోటని పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. గురువారం జనగామ కెమిస్ట్రీ భవన్‌లో కవులు కళాకారుల ఐక్యవేదిక పొట్టబత్తిని భాస్కర్ యాదిలో ఏర్పాటు చేసిన కలాలు గళాల నీరాజనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి పెట్లోజు సోమేశ్వరాచారి, జరసం అధ్యక్షుడు నక్క సురేష్ అధ్యక్షత వర్గంగా సాగిన ఈ కార్యక్రమంలో సమ్మయ్య మాట్లాడుతూ భాస్కర్ కవి సామాజిక స్పృహ కలిగి చక్కని వచన కవిత్వం సృజించారని అన్నారు. ఉపాధ్యాయులుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన గురువు భాస్కర్ అని గుర్తు చేశారు. సభలో పాల్గొన్న ప్రజా వైద్యులు కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ భాస్కర్ భౌతికంగా మన మధ్యలో లేకున్న ఆయన విడిచి వెళ్లిన ఆశయాలు మన ముందున్నాయని అన్నారు. నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు మాట్లాడుతూ కవి భాస్కర్ చక్కని వ్యక్తిత్వం కలిగినవారని అన్నారు. తొలుత భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, నెల్లుట్ల రవీందర్ రావు, జి.కృష్ణ, లగిశెట్టి ప్రభాకర్, డా.వేముల సదానందం,కొలిపాక బాలయ్య, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, గుగ్గిల నర్సయ్య,గట్టగల్ల సంజీవ, కడారి శ్రీను, చిలుమోజు సాయికిరణ్, రంగరాజు ప్రసాద్, సదానందం, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, మసురం రాజేంద్రప్రసాద్, బాల్నె నీరజ, గుండె కనకయ్య, గొలుసుల ఎల్లయ్య, గొలుసుల నర్సయ్య,టి.రామచంద్రం, జోగు సుదర్శన్,వినోద్, రాజు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## ఖిలాషాపురం పీఎంశ్రీ పాఠశాలలో

# కరాటే శిక్షణ ప్రారంభం



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని ఖిలాషాపురం పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెడ్‌మాస్టర్ డాక్టర్ భారత రవీందర్ ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జీసీడీవో గౌసియా బేగం పర్యవేక్షణలో విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ బాలికలకు ఈ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను అందిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో బాలికల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేలా అవసరమైన నైపుణ్యాలను ఈ శిక్షణ ద్వారా నేర్పిస్తున్నట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోనెల సోమన్నతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కోమల్ల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పరశురాములు గౌడ్

**రఘునాథ పల్లి, మన చౌరాస్తా :** కోమల్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాల్నే పరశురాములు గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నూతన గ్రామ అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కొత్త కర్ణాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చంద్రారెడ్డి, కోళ్ల రవి, లోనే శ్రవణ్ కుమార్, మేకల నరేందర్, గొట్టం భాస్కర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యవారిగూడెం కాంగ్రెస్ అధ్యక్షుడిగా క్రాంతికుమార్ ఎన్నిక



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండలం అయ్యవారిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పరునంది క్రాంతికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కొత్త కర్ణాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా ఎన్నికైన గ్రామ అధ్యక్షుడు క్రాంతికుమార్ కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని అన్నారు.

# సాగు నీరు లేక పొలాలు ఎండుతున్నయ్

- **మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆవేదన**
- **చిన్నమడుర్‌లో 300 పంట పొలాలు ఎకరాలు పడావు**



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** దేవరుప్పుల మండలంలోని చిన్నమడుర్ గ్రామంలో సాగు నీరు అందక సుమారు 300 ఎకరాల పంట పొలాలు పడావు పడటంపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమాదుర్ నుండి రాంబోజీగూడెం వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యలో రోడ్డు పక్కన గోపి చెరువు ఆయకట్టు కింద ఎండిపోయిన పొలాలను, ఖాళీగా ఉన్న వాగును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాజీ మంత్రితో మాట్లాడుతూ.. దేవాదుల ప్రయోజనాల్లో భాగమైన నవాబుపేట రిజర్వాయర్ నుండి నీళ్లు విడుదల చేయకపోవడంతోనే తాము ఈ వానాకాలం వరి నాట్లు వేయలేకపోయామని వాపోయారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాదే పంటలు వేయకుండా పొలాలను పక్కన పెట్టాల్సి వచ్చిందని, తమకు వ్యవసాయం తప్ప వేరే ఆధారం లేదని ఆవేదన చెందారు. ఎలాగైనా అధికారులు నీళ్లు విడుదల చేసేలా చూసి తమను ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై స్పందించిన ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్రంలో అసమర్థ కాంగ్రెస్ పాలన సాగుతోందని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటా నవాబుపేట రిజర్వాయర్ నింపి, అక్కడి నుండి దేవరుప్పుల మండలంలోని గ్రామాల చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లను నింపేవాళ్లమని గుర్తు చేశారు. పుష్కలంగా నీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ వర్షాకాలంలో కూడా ప్రభుత్వం నీళ్లు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగు నీరు విడుదల చేయకపోతే, రైతులను సమీకరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవరుప్పుల మండల బిఆర్ఎస్ నాయకులు, చిన్నమడుర్, రాంబోజిగూడెం గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు జనగామలో కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

**జనగామ, మన చౌరాస్తా :** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరైన సభా ప్రాంగణాన్ని కొందరు హిందూ మితవాద సంస్థల ప్రతినిధులు గంగాజలంతో శుద్ధీకరణ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం (ఆగస్టు 14) సాయంత్రం జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణ నాయకత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరగనుంది. ఖర్గే పట్ల జరిగిన ఈ వివక్షపూరిత చర్యను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఈ పోరాటానికి సమాయత్తమయ్యాయి. శుక్రవారం సాయంత్రం 4:00 గంటలకు స్థానిక మహాత్మా గాంధీ విగ్రహం నుండి ప్రారంభమయ్యే ఈ నిరసన మార్చ్, జనగామ బస్టాండ్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుంది. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ఏఐసీసీ, టీపీసీసీ నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా, యూత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యాన్ని (డీఏ) వెంటనే విడుదల చేయాలని, వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) నివేదికను తెప్పించుకుని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల కోసం గత మూడు నెలలుగా వేతనాల నుంచి నగదు మినహాయిస్తున్నప్పటికీ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా ఈ వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఆలేటి యాదవ రెడ్డి, దూదయ్య, కళింగ రెడ్డి, మోహన్‌రావు, రేణుక, సునంద, పద్మజ, విజయరాణి, యాదయ్య, సంపత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మకుంటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** బతుకమ్మ కుంటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సెక్యూరిటీని నియమించాలని కోరుతూ టీఆర్పీ యూత్ జిల్లా అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్పీ యూత్ నాయకులు పాల్గొన్నారు.

# టీఎస్సీపీఎస్ఈయూ మండల కమిటీ ఎన్నిక

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** టీఎస్సీపీఎస్ఈయూ రఘునాథపల్లి మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మచ్చ రాజేందర్, గౌరవ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంతగుల్ల కుమార్, ఉపాధ్యక్షుడిగా కందగట్ల గణేష్, సంయుక్త కార్యదర్శిగా దయ మల్లేశం, కోశాధికారిగా గోనెల సోమన్న, కార్యవర్గ సభ్యులుగా నర్సింగరావు శాగంటి, పి. లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి జిల్లా అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలిపారు. పాత పెన్షన్ సాధన కోసం ఆగస్టు 23న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు రాజేందర్ పిలుపునిచ్చారు. అనంతరం చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.






# జనగామలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలోని దర్గా వద్ద బాబా షా బాబా ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హబీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి ఆయన నివాసం నుంచి గంధం తీసుకుని ఊరేగింపుగా దర్గా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గంధం ఊరేగింపు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబా షా బాబా ఆశీస్సులు పొందాలని కోరారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ




**జనగామ, మన చౌరాస్తా :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జనగామ పట్టణంలో తిరంగా ర్యాలీ వైభవంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ పార్క్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరు కాగా దాదాపు వెయ్యి మంది విద్యార్థుల సమక్షంలో జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. వేలాది మంది మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, ఆ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకుంటూ దేశ పునర్నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ నలుమూలలా తన ప్రతిష్టను చాటుకుంటూ విశ్వగురువుగా ఎదుగుతోందని, ప్రతి ఒక్కరూ పార్టీ జెండాలను పక్కన పెట్టి జాతీయ జెండాను ఎజెండగా చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, రాష్ట్ర నాయకులు కె.వి.ఎల్.ఎన్. రెడ్డి, సాగర్ రెడ్డి, ఉడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎల్లబోయిన హరీష్, పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకులు సంతోష్, మహిపాల్, రాజు, జగదీష్‌లతో పాటు బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**